
మౌనరాగం
అంగులూరి అంజనీదేవి

# మౌనరాగం

శ్రీమతి అంగులూరి అంజనీదేవి

చరణ్ పబ్లికేషన్స్
హన్మకొండ, వరంగల్ జిల్లా.

# అంగులూరి అంజనీదేవి
# రచనలు

నవలలు :

1. మధురిమ
2. నీకు నేనున్నా...
3. మౌనరాగం
4. ఈ దారి మనసైనది
5. రెండో జీవితం
6. ఎనిమిదో అడుగు
7. ఆమె అతడిని మార్చుకుంది
8. ఆరాధ్య
9. ఇలా ఎందరున్నారు...?
10. జ్ఞాపకం
11. మౌన ఘర్షణ
12. ఒక చిన్న అబద్ధం...!

కథల సంపుటి :

1. జీవితం అంటే కథ కాదు!

కవితా సంపుటి :

1. గుండెలోంచి అరుణోదయం

# మౌనరాగం...

జీవితం గాఢమైంది. నిగూఢమైంది.

స్వల్ప విషయాలకే ఆనందపడేలా చేస్తుంది.

కారణం లేకుండానే బాధపెడ్తుంది. కష్టపడకుండా, కొనకుండా, సంపాయించకుండా దొరికిన ప్రేమకోసం తాపత్రయ పడేలా చేస్తుంది. హృదయంలోని ప్రేమనంతా బయటపెట్టి ఎన్నో అడగాలనుకునేలా చేస్తుంది.

రాత్రింబవళ్లు వువ్విళ్లూరుతూ నిద్రను చెదరగొట్టి, స్వప్నాలను దాచుకొని, సమస్యల్ని సృష్టించి ఒకరికోసం ఒకరు బాధపడేలా చేస్తుంది

భూమి మాత్రం గుండ్రంగా తిరుగుతూ నిమిషాలను, గంటలను లాక్కెళ్తోంది.

కాలమేమో నిమిత్త మాత్రంగా తనపనిలో తను లీనమై వుంది.

దేదీప్య మొబైల్ తీసి నెంబర్ నొక్కి కాల్ బటన్ ప్రెస్ చేసింది. అవతల మొబైల్‌కి సిగ్నల్స్ వెళ్తున్నాయి...

మనసు లోతుల్ని తాకుతూ 'కాలర్ టోన్' గోదారి ప్రవహిస్తున్నట్లు, పక్షులు పాడుతున్నట్లు, చిరుగాలి చుట్టూ చేరి 'నీ కళ్లు నేను తుడవనా' అన్నట్లు అన్పిస్తోంది దేదీప్యకి.

అవతల వైపు నుండి ...

"హలో...చెప్పు దేదీప్యా!" అంటూ అతని గొంతు గట్టిగా విన్పించింది. ఎన్ని సార్లు ఫోన్ చెయ్యమన్నా చెయ్యని దేదీప్య యిప్పుడెందుకు చేసిందో అర్థం కాక...

అతని గొంతు వినగానే ఏంమాట్లాడాలో తెలియక...

" హాయ్!" అని పలకరించిందే కాని ఆమె గొంతు పెగల్లేదు.

"మాట్లాడు దేదీప్యా ! ఎందుకు ఆగిపోయావ్?" అంటూ అవతల వ్యక్తి గొంతు ఆత్రంగా ధ్వనించింది.

ఆమె మాట్లాడకుండా గట్టిగా ఏడ్చేసింది.

"ఎక్కడున్నావు దేదీప్యా ? ఎందుకేడుస్తున్నావ్? ఏం జరిగింది?" అని అంటున్న అతని హృదయతంత్రులు ఆమెకేం జరిగిందోనన్న భయంతో తెగిపోయేలా వున్నాయి.

అతని గొంతులోని మార్ధవానికి ఆమె మనసు కరిగిపోయింది

పంచుకునే వాళ్లుంటేనే  ఫలితానికైనా, ఫలానికైనా రుచి

భోగ భాగ్యాలు ఎన్నున్నా ఒంటరితనం కటిక చీకటి.

కాలం కడలిని దాటుకుంటూ, మరుగునపడ్డ జ్ఞాపకాలను ఆమె మనసు స్పృశిస్తుంటే చెవి దగ్గర మొబైల్ పెట్టుకొని ఏం చెప్పాలో అర్థం కాక అలాగే ఏడుస్తోంది...

అర్థం చేసుకున్నాడతను.

"ఏడవకు దేదీప్యా ! నువ్వు ఏడిస్తే నేను తట్టుకోలేను. నీ మనసు పూర్తిగా నీలోకి వచ్చినతర్వాతనే... నాతో సరిగ్గా మాట్లాడగలనన్న నమ్మకం నీలో ఏర్పడిన తర్వాతనే నా మొబైల్‌కి కాల్ చెయ్యి" అన్నాడతను.

వెంటనే ఆమె మనస్సు గతంలోకి వెళ్లిపోయింది.

సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం......

దేదీప్య ఎం.బి.ఎ. సీటు కోసం కాకతీయ యూనివర్శిటి క్యాంపస్‌లో వున్న కౌన్సిలింగ్ బ్రాంచి దగ్గరకి వాళ్ళ అన్నయ్య దేవేందర్ తో వెళ్లి.... అక్కడ చెట్ల నీడలో నిలబడింది.

ఆమె చూపులు చెట్లను, ఇళ్ళను దాటుకుంటూ ఎక్కడికో వెళ్ళి నిలిచాయి.

ఆకాశం, భూమి కలిసే చోటును చూడాలంటే ఆమెకు చాల ఇష్టం. ఆకాశం ఒక చిత్రకారుని కాన్వాస్‌లా మారి మబ్బుల డిజైన్ కోసం ఎదురు చూస్తుంటే మబ్బులొచ్చి సూర్యునికి అడ్డుపడ్డాయి. నేలకళ్లు మసక బారినట్లయ్యాయి. సూర్యుడు మబ్బుల చాటు నుండి బయటకు రాకముందే దేదీప్య కళ్లకి అభిరాం కన్పించాడు.

"ఎవరీ హ్యాండ్‌సమ్ గాయ్," అని మనస్సులో అనుకోకుండా వుండలేకపోయింది. కొన్ని క్షణాలు అతనివైపు అలాగే చూసింది.

స్టూడెంట్స్‌తో, పేరేంట్స్‌తో ఆ ప్రదేశం కిటకిటలాడుతోంది.

మైక్‌లో 'ర్యాంక్స్' అనౌన్స్ చేస్తున్నారు.

'స్క్రీన్ డిస్‌ప్లే' చేస్తున్నారు.

దేదీప్య అక్కడే నిలబడి అందులో వస్తున్న ర్యాంక్ కేటగిరిని, సీట్స్‌ని గమనిస్తోంది. వాళ్ల అన్నయ్య కూడా అదే పనిలో వున్నాడు.

మధ్యమధ్యలో అభిరాంని చూస్తోంది దేదీప్య.

ఎం.బి.ఎ. సెకండియర్ చదువుతున్న అభిరాం వాళ్ళ కజిన్ కోసం అక్కడికి వచ్చాడు.

వాళ్ళంతా తమకి సీటు ఏ కాలేజిలో వస్తుందో, ఏ కాలేజిని 'చూజ్' చేసుకోవాలో అర్థం కాని అయోమయస్థితిలో వున్నారు.

అక్కడున్న అబ్బాయిలు కాని, అమ్మాయిలు కాని ఒకరినొకరు పట్టించుకునేలా లేరు. వాళ్ళలో కొంతమంది పేరెంట్స్ కోసం, కొంతమంది కాలక్షేపం కోసం, మరికొంతమంది బాగా చదవి ఉన్నతమైన స్థాయిలోకి రావటం కోసం వచ్చిన వాళ్ళే వున్నారు. ఉన్నతమైన స్థాయిలోకి వెళ్ళాక నలుగురికి ఎంతోకొంత ఉపయోగపడాలనుకునే వాళ్ళు కూడా వున్నారు. ఆ కోవకు చెందిన వ్యక్తి దేదీప్య. కొండంత ఆత్మవిశ్వాసంతో స్థిర నిశ్చయంతో ఆమె ఆలోచనలెప్పుడు ఆమె ముఖంలో ప్రతిఫలిస్తుంటాయి.

మళ్లీ ర్యాంక్ అనౌన్స్‌మెంట్ జరిగింది

ఆ అనౌన్స్‌మెంట్‌లో దేదీప్య పేరు విన్పించింది.

అంతవరకు అలర్ట్‌గా వున్న దేదీప్య వెంటనే తన ర్యాంక్ కార్డుని పట్టుకెళ్లి కౌన్సిలింగ్ హాల్లో 'సిస్టమ్' ముందు కూర్చుని వున్న ఒక వ్యక్తి చేతికి యిచ్చింది. కొద్దిసేపు అక్కడే నిలబడి తర్వాత బయటకొచ్చింది.

దేదీప్య అన్నయ్య కాస్త పక్కకి వెళ్లి అక్కడున్న పేరెంట్స్‌తో ఏ కాలేజి అయితే ఎం.బి.ఎ.కి బావుంటుందో అడిగి తెలుసుకుంటున్నాడు. తనకి తెలిసిన 'ఇన్‌ఫర్‌మేషన్' కూడా వాళ్లకి చెబుతున్నాడు.

దేదీప్య నిలబడలేక అక్కడే ఓ చెట్టుక్రింద వున్న చెయిర్లో కూర్చుంది. దేదీప్యను చూడగానే కావ్య అనే అమ్మాయి వచ్చి 'హాయ్!" అంది. ఒకరిపేర్లు ఒకరు చెప్పుకొని ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

తోడుగా వచ్చిన తన తల్లి సరళమ్మను దేదీప్యకు పరిచయం చేసింది కావ్య.

"మాది నల్గొండ దేదీప్యా! ఇక్కడ మాకు తెలిసిన వాళ్లెవరు లేరు. కావ్యకి ఏ కాలేజీలో సీటు వస్తుందో అని కంగారుగా వుంది. ఏ కాలేజీలో సీటు తీసుకోవాలో అర్థం కాకుండా వుంది!" అంది సరళమ్మ.

" అంత కంగారు పడొద్దు ఆంటీ! మీరు ప్రశాంతంగా వుండండి! కావ్యకి మంచి కాలేజీలోనే సీటొస్తుంది." అంటున్న దేదీప్యను చూస్తుంటే తమకెంతో దగ్గరి మనిషిలా అన్పించింది, సరళమ్మకి.

"దేదీప్యా ! నీకు తోడుగా ఎవరొచ్చారమ్మా?" ప్రేమగా అడిగింది సరళమ్మ.

'అన్నయ్య వచ్చాడు ఆంటీ! అదిగో అక్కడ మాట్లాడుతున్నాడే ఆయనే మా అన్నయ్య." "అంది దేవేందర్‌ని చూపిస్తూ దేదీప్య .

"అన్నయ్య ఏంచేస్తున్నారమ్మా?" అంటూ ఆసక్తిగా వివరాలు అడిగింది సరళమ్మ.

"హైదరాబాదులో ఒక ప్రైవేటు కంపెనీలో ఇంజనీరు ఆంటీ! వదిన వరంగల్‌లోనే జాబ్ చేస్తోంది. అన్నయ్య వారానికి ఒకసారి వదిన దగ్గరికి

వచ్చివెళ్తుంటాడు. నా స్టడీ డిస్టర్బ్ కాకుండా నన్ను హాస్టల్లో వుంచి చదివించారు. డిగ్రీ వరకు ఖమ్మంలో చదివాను. ఈ వరంగల్ నాకు కొత్త" అంది దేదీప్య.

తెలిసిన వాళ్లెవరో కన్పించడంతో వాళ్లవైపు వెళ్లింది సరళమ్మ.

అనౌన్స్‌మెంట్‌లో దేదీప్య పేరు విన్పించగానే సడన్‌గా కుర్చీలోంచి లేచింది. అభిరాం దృష్టి యాదృశ్చికంగానే దేదీప్య పై పడింది. కౌన్సిలింగ్ హాల్‌వైపు వెళ్తున్న దేదీప్య కదులుతున్న గులాబి గుంపులా అన్పించింది అభిరాంకి. 'వావ్' అనుకున్నాడు.

తీరైన ఆమె స్ట్రక్చర్, కుదురైన ఆ నడక, నడుస్తున్నప్పుడు కదులుతున్న ఆ హెయిర్‌స్టైల్‌ని అలాగే చూశాడు.

అందాన్ని అస్వాదించటంలో అతని ముందు ఏ ఆర్టిస్ట్ పనికిరాడు.

దేదీప్య పేరు ర్యాంక్ తో సహా అనౌన్స్ చేశారు. లోపలే వున్న దేదీప్య తనకి వచ్చిన ఆప్షన్‌లో వరంగల్ అల్లూరి కాలేజిని చూజ్ చేసుకుంది.

కావ్యకి కూడా దేదీప్యకి వచ్చిన కాలేజీలోనే సీటొచ్చింది.

"మీ ఇద్దరికి ఒకే కాలేజిలో సీటురావడం నాకు ధైర్యంగా వుంది దేదీప్యా!" అంది సంతోషపడ్తూ సరళమ్మ అదే విషయం దేవేందర్ తో కూడా చెప్పింది. దేవేందర్ సంతోషించాడు.

"ఆంటీ! వీలైతే ఇప్పుడు మా యింటికి రండి! తర్వాత వెళ్దురుగాని" అంటూ ఆహ్వానించింది దేదీప్య.

"ఇప్పుడు వీలుకాదు దేదీప్యా! ఇంటి దగ్గర అంకుల్ ఎదురు చూస్తుంటారు. మీ కాలేజీలు మొదలయ్యాక ఒక రోజు వచ్చి కావ్యను మంచి హాస్టల్లో జాయిన్ చేసి వెళ్తాను. అప్పుడు మీ ఇంటికి తప్పకుండా వస్తాను". అంది సరళమ్మ దేదీప్య ఆహ్వానానికి ఆనందిస్తూ.

"ఓ.కె. ఆంటీ! కావ్యా బై ". అంటూ అన్నయ్య బైక్ మీద ఎక్కి ఇంటికెళ్లింది దేదీప్య

వెళ్తూ, వెళ్తూ, మళ్లీ అభిరాం కన్పిస్తే చూడాలన్న కుతూహలంతో కౌన్సిలింగ్ హాల్ కన్పించినంతవరకు చూస్తూనే వెళ్లింది.

ఆ టైంలో అభిరాం అక్కడ లేదు. వాళ్ల కజిన్‌తో కలసి కౌన్సిలింగ్ హాల్లోకి వెళ్లాడు.

వాళ్ల కజిన్‌కి హైదరాబాద్‌లో టాప్ టెన్ కాలేజీలో సీటొచ్చింది.

* * * * *

తెల్లవారుజామునే నిద్రలేచి రెడీ అయ్యి, పుష్పుల్ ట్రైనెక్కి హైదరాబాద్ వెళ్లాడు దేవేందర్. ప్రాజెక్టు వర్క్ కోసం అదే ట్రైనెక్కి అభిరాం కూడా హైదరాబాద్ వెళ్లాడు.

ఉదయం తొమ్మిది గంటలు దాటటంతో దేవేందర్ భార్య అపురూప తనకి ఆఫీసు టైమవుతుందని త్వరత్వరగా రెడీ అవుతోంది.

దేదీప్య టీ.వి. చూద్దామని కూర్చుంటే కరెంట్ పోయింది. గాలి రాకపోవడంతో ఊపిరాడనట్లై 'ఉఫ్' అంటూ అక్కడేవున్న పేపరు అందుకొని తలమీద పెట్టుకొంది. దేదీప్యనలా చూడగానేనవ్వొచ్చింది అపురూపకి.

దేదీప్యకి బోర్‌గా వుంది. బయట కెళ్దామంటే తోడు ఎవరూ లేరు. చదువుదామంటే బుక్స్ లేవు. మూలుగుతున్న నక్క మీద తాటికాయపడ్డట్లు కరెంట్ కూడా ఇప్పుడేపోయింది.

అప్పటికే సర్దిపెట్టుకొని వున్న లంచ్‌బాక్స్‌ని బ్యాగులో పెట్టుకుంటూ

"దేదీప్యా! నేను ఆఫీసుకి వెళ్లివస్తాను. నేను వచ్చేవరకు క్రిందకెళ్లి మామ్మ దగ్గర కూర్చో టైంపాస్ అవుతుంది. అలానే తాతగారి దగ్గర మంచి బుక్స్ వుంటాయి. తెచ్చుకొని చదువుకో" అంది అపురూప.

ఏ మాత్రం కదలకుండా అలాగే కూర్చుని వున్న దేదీప్య వైపు చూస్తూ

"ఓ... నీకు మామ్మతో పరిచయం లేదు కదూ! నాతోరా! పరిచయం చేస్తాను. నిన్ను మామ్మకి పరిచయం చేసి, అటునుండి అటే ఆఫీసుకి వెళ్తాను". అంది అపురూప.

"సరే ! వదినా!" అంటూ క్రిందకు దిగుతున్న అపురూపతో తను కూడా క్రిందకి దిగింది దేదీప్య.

త్వరత్వరగా దేదీప్యను ఇందుమతికి పరిచయం చేసి వురుకులు, పరుగులు అన్నట్లుగా ఆఫీసుకెళ్లింది అపురూప.

మెరూన్ కలర్ అంచున్న ఆకుపచ్చని గద్వాల్ చీర కట్టుకొని పెద్దబొట్టు పెట్టుకొని, సోఫాలో కూర్చుని వున్న ఇందుమతిని చూడగానే గౌరవ భావం కల్గింది దేదీప్యకి. దేదీప్య వైపు చూస్తూ.....

“నీపేరు నాకు బాగా నచ్చింది దేదీప్యా ! నువ్వు కూడా బాగున్నావ్!” అంటూ దేదీప్య చేయిపట్టుకొని తన పక్కన కూర్చోబెట్టుకొంది ఇందుమతి.

క్యాలండర్‌లో వుండే ‘అమ్మవారికి’ ఈ ఇందుమతికి రూపురేఖల్లో పెద్ద తేడా లేదు అని మనస్సులో అనుకొంది దేదీప్య.

“ఏం చదువుతున్నావు దేదీప్యా?” అడిగింది ఇందుమతి.

“డిగ్రీ అయిపోయింది బామ్మా! ఎం.బి.ఎ. లో సీటొచ్చింది.” చెప్పింది దేదీప్య.

“ఎం.బి.ఎ. సీటు ఏ కాలేజీలో వచ్చింది?” ఆసక్తిగా అడిగింది ఇందుమతి ఆమె ఆ రోజుల్లో బాగా చదువుకున్న మహిళ.ఇంగ్లీష్ చదవటం,రాయటం బాగావచ్చు.

“అల్లూరి కాలేజిలో వచ్చింది బామ్మా!” అంది దేదీప్య.

“నా మనవడు అభిరాం కూడా ఎం.బి.ఎ. సెంకడియర్ చదువు తున్నాడు. అల్లూరి కాలేజిలోనే. అదిగో ఆ ఫోటోలో వున్నాడే. వాడే నా మనవడు. ప్రాజెక్టు వర్క్ కోసం ఈ రోజు హైదరాబాద్ వెళ్లాడు”. అంటూ గోడకి వున్న అభిరాం ఫోటోని చూపించింది, ఇందుమతి.

ఫోటో వైపు చూడలేదు దేదీప్య. వాళ్ళ మనవడితో తనకేంపని అన్నట్లుగా మౌనంగా కూర్చుంది.

ఇందుమతి ఆ ఫోటోనే దీక్షగా చూస్తూ....

“ ఈ ఫోటో మాతోటలో తీసిందే. పూలను చూసి ఎలా పరవశించి పోతున్నాడో చూడు. పువ్వులన్నా, ఆకులన్నా, చెట్లన్నా చాలా యిష్టం వాడికి. చిన్నవయసులో వున్నప్పుడు పచ్చటి పూలమొక్కలున్న తోటల్లో, చేలల్లో ఎక్కువగా తిరుగుతుండేవాడు. వేళకి వాడ్ని పట్టుకోవాలంటే నావల్ల అయ్యేది కాదు. ఎండలో తిరగటం అంత మంచిది కాదని పనిపిల్లాడితో గొడుగు యిచ్చి పంపేదాన్ని. కాలేజి స్టడీస్‌కి వచ్చాక ఎండలో తిరగటం కాస్త తగ్గించాడు. మొదటి నుండి

వాడి బాధ్యతంతా నాదే. వాళ్లమ్మది కాదు" అంటూ కాస్త గర్వంగా, అంతపెద్ద మనవడు తనకు వున్నందుకు మరికాస్త మురిపెంగా చూసింది ఇందుమతి.

వింటూ కూర్చుంది దేదీప్య. పెద్దవాళ్ల మాటల్ని ఎంత శ్రద్ధగా వింటుందో, నచ్చకపోతే అంతే శ్రద్ధగా 'నో' అని కూడా చెబుతుంది.

"ఎవరితో మాట్లాడుతున్నావు ఇందూ?" అంటూ అప్పుడే హాల్లోకి వచ్చాడు నారాయణరావు.

ఇందుమతికి ఎదురుగా కూర్చుంటూ, 'ఎవరీ కొత్తవ్యక్తి' అన్నట్లుగా దేదీప్యను చూశాడు.

"మన పై పోర్షన్‌లో అద్దెకుండే దేవేందర్ చెల్లెలండి! పేరు దేదీప్య. మన అభిరాం చదివే కాలేజీలోనే సీటొచ్చిందట. వీళ్లకి యింకా క్లాసులు మొదలవలేదు. అందుకే ఇంట్లో వుంది" అంది ఇందుమతి.

"అలాగా! చూడమ్మా! దేదీప్యా! నా పేరు నారాయణరావు. కాకతీయ యూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేసి రిటైరయ్యాను. ఇందుమతి నాభార్య" అంటున్న ఆయన మాటల్లో బోలెడు తృప్తి.

వాళ్ల మాటలు వింటూనే చుట్టూ పరిసరాలను గమనిస్తోంది దేదీప్య.

ఆ హాల్లో ఓ మూలగా ఇత్తడి కుండీల్లో గుబురుగా పెరిగి, తీగలు సాగిన 'మనీప్లాంట్' దేదీప్య ను బాగా ఆకర్షించింది.

హాల్లోకి అడుగుపెట్టగానే అందరికి కన్పించే విధంగా మెటల్‌తో తయారు చేసిన కవుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా వున్నాయి.

వాటిలో బమ్మెర పోతన, శ్రీ. శ్రీ. చలం, కాళోజి నారాయణరావు, ఇంకా తను గుర్తుపట్టలేని కొంతమంది పురాతన కవుల విగ్రహాలు వున్నాయి.

"ఈ విగ్రహాలు బావున్నాయి బామ్మా! ఎక్కడ తెప్పించారు? హాల్లోకి రాగానే యివే షోగా అన్పిస్తున్నాయి". అంటూ ఆసక్తిగా వాటినే చూస్తున్న దేదీప్య భుజంపై ఆప్యాయంగా చేయివేసింది ఇందుమతి.

"వీటినిక్కడ షో కోసం పెట్టలేదు దేదీప్యా! మీ తాతగారికి కవులన్నా, కవిత్వమన్నా చాలా ఇష్టం. సొంతంగా కవితలు కూడా రాస్తారు. ఆయన రాసిన ఒక కవితాసంపుటికి అవార్డు వచ్చింది" అంది ఇందుమతి.

"అవునా తాతగారు! మీరు కవితలు రాస్తారా? కథలు, కవితలు, నవలలు చదవాలన్నా, అవి రాసేవాళ్లతో మాట్లాడాలన్నా నాకు చాలా ఇష్టం." అంది దేదీప్య.

"వరంగల్‌లో రాసేవాళ్లు బాగానే వున్నారు దేదీప్యా ! వాళ్లలో కవితలు రాసేవాళ్లు, నవలలు రాసేవాళ్లు,స్వీయ చరిత్రలు రాసేవాళ్లు వున్నారు. వాళ్ళంతా అప్పుడప్పుడు వచ్చి తాతగారిని కలసివెళ్తుంటారు. వాళ్ళందరితో మంచి సత్ సంబంధాలు వున్నాయి." అంది ఇందుమతి.

"సాధ్యమైతే వాళ్ళందరిని చూడాలని వుంది. వాళ్లు రాసినవి చదవాలని వుంది." అంటూ తన మనసులోని మాట చెప్పింది దేదీప్య. దేదీప్యకి సాహిత్యం పట్ల గొప్ప అభిమానం.

చదివేవాళ్లు తక్కువగా వున్న ఈ రోజుల్లో దేదీప్య అలా అనటం నారాయణ రావుకి నచ్చింది.

"ఇంత కాలానికి మీ తాతగారికి మంచి శ్రోతవు, పాఠకురాలువు దొరికావు దేదీప్యా! శ్రీ. శ్రీ గురించి చలం గురించి నాలుగు మాటలు వినమన్నా, చదవమన్నా, ఆమడ దూరం పోతాడు అభిరాం!" అంటూ నవ్వింది ఇందుమతి.

"అభిరామే కాదు ఇందూ! ఈ రోజుల్లో చాలా వరకు సాహిత్యం పట్ల అలాగే వున్నారు. ఒకప్పుడు కవితలు చదివేవాళ్ల కన్నా నవలలు చదివే వాళ్లే ఎక్కువగా వుండేవాళ్లు. ఇప్పుడు అంతో, ఇంతో నవలలు కన్నా కవితలు చదివేవాళ్లే అక్కడక్కడ కన్పిస్తున్నారు. అది కూడా మినీ కవితలు, నానీలు అయితేనే చదువుతున్నారు" అన్నాడు నారాయణ రావు.

" ఎందుకని తాతగారు?" అంది దేదీప్య.

"నవలలు చదవాలంటే తీరిక, ఓపిక చాలా అవసరం. ఇప్పటి అలవాట్లు, ఆలోచనలు, మనిషికి టైం లేకుండా చేస్తున్నాయి. ఒక దశాబ్దకాలం నుండి నవల అంతరించిపోతున్నట్టే అందరం అనుకుంటున్నాం. పాఠకులు లేరని రచయితలు, రచయితలు లేరని పాఠకులు నవలా సాహిత్యానికి దూరమవు తున్నారు. పాఠకుల్లో పఠనాశక్తి కొరవడటం, రచయితలు రచనలు చెయ్యక పోవడం రెండూ తప్పే. అక్షరాన్ని అభినందించలేకపోవటం ఆరాదించక పోవటం ఇంకా తప్పు" అన్నాడు నారాయణరావు.

“అక్షరం పట్ల మీకున్న అభిరుచి అందరికి వుండొద్దూ! అందులో ఇది కంప్యూటర్ యుగం” అంది ఇందుమతి.

“ఎంత కంప్యూటర్ యుగమైనా వేళ్ల సందుల్లోంచి పాయసంలా జారిపోతున్న కాలాన్ని నవల చదవటానికి ఉపయోగిస్తే తప్పేంటి? మన తెలుగులో కాని, ఇంగ్లీష్‌లో కాని ఎంతోమంచి నవలలు వున్నాయి”. అన్నాడు నారాయణ రావు.

నవల దొరికితే వదిలిపెట్టని దేదీప్య నారాయణ రావు నోటివెంట నవలల గురించి విన్పించటంతో ఎంతో ప్రియంగా చూసింది.

“ఆ నవలలు మీ దగ్గర వున్నాయా తాతగారు?” ఆశగా అడిగింది దేదీప్య.

“కొన్ని నవలలు వున్నాయి దేదీప్యా! రా. నా గదిలోకి వెళ్లి కూర్చుందాం. నేనీ మధ్యన
రాసిన వ్యాసాలు కొన్ని చూపిస్తాను”. అంటూ దేదీప్యను ఆయన గదిలోకి ఆహ్వానించాడు. వెంటనే లేచి ఆయన వెంట వెళ్లింది దేదీప్య

ఆ గదిలోకి వెళ్లగానే... “దేదీప్యా ! పుస్తకాలు అనేవి కవి అనంతమైన కాల సముద్రం ఒడ్డున నిర్మించిన లైట్ హౌస్‌లు. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది. తల్లి శరీరాన్ని పోషించి పెంచితే పుస్తకాలు హృదయాన్ని పోషించి పెంచుతాయి. పాత బట్టలు ధరించినా పర్వాలేదు కాని, కొత్త పుస్తకాలను మాత్రం కొనకుండా వుండలేను. పుస్తకాలను మించిన అందమైన ఫర్నిచర్ మరొకటి లేదు నా దృష్టిలో. ఇదీ నా ప్రపంచం. “అంటూ తన గదిలో వున్న పుస్తకాలవైపు చూపించాడు నారాయణరావు.

ఆజాను భాహువులా వున్న నారాయణరావు ధోవతీ లాల్చీలో చూడగానే ‘నమస్కారం’ పెట్టేలా అన్పిస్తారు. పోషక విలువలు కలిగిన తిండివల్ల వయసు ప్రభావం ఆయన మీద అంతగా పడలేదు. ఆరోగ్యంగా, ఆనందంగా వున్నారు.

ఆ గదిలో పుస్తకాలన్నీ క్రమపద్ధతిగా అమర్చి వున్నాయి. గది గోడల్లో పొందికగా వున్న అరల నిండా సాహిత్యానికి, విజ్ఞానానికి,వేదాంతానికి సంబంధించిన పుస్తకాలే కాక మంచి, మంచి నవలలు కూడా వున్నాయి.

నారాయణరావు కూర్చోమనగానే కూర్చుంది దేదీప్య.

అక్కడే కూర్చుని నారాయణ రావు  రాసిన కొన్ని వ్యాసాలను చదివి అప్పటికప్పుడే ఆ వ్యాసాలపై తన అభిప్రాయాన్ని చెప్పింది.

చిన్నపిల్లాడిలా పొంగిపోయాడు నారాయణరావు. ఆయన్నలా చూస్తూంటే సంతోషమనిపించింది దేదీప్యకి.

ఎప్పుడైనా కళాకారులు చిన్నపిల్లల్లాంటివారు. రవ్వంత ఉత్సాహం వారిపట్ల చూపిస్తే పొంగిపోతారు. మీ విజయాన్ని మేము గమనిస్తున్నాం అని అభిమానం కురిపిస్తే రెట్టింపు ఉత్సాహంతో మరింత కృషి చేస్తారు.

దేదీప్య సమక్షంలో తన భర్త ముఖం అంతగా వెలిగిపోతుంటే ఇందుమతికి ఆనందంగా అన్పించింది.

"చాలా కాలం తర్వాత మీ తాతగారిలో నిజమైన సంతోషాన్ని చూస్తున్నాను  దేదీప్యా! అప్పుడప్పుడు వచ్చివెళ్తుండు." అంది ఇందుమతి.

"సరే !బామ్మా !" అంటూ నారాయణ రావు తనని చదవమని ఇచ్చిన 'అసమర్థుని జీవన యాత్ర" నవలను పేజీలు తిప్పుతూ కూర్చుంది.

ఆ దంపతుల సమక్షంలో ఎంతసేపు కూర్చున్నా యింకా కూర్చోవాలనిపిస్తోంది  దేదీప్యకి.

* * * * *

ప్రాజెక్టు వర్క్ కోసం హైదరాబాదు వెళ్లిన అభిరాం రెండు రోజుల తర్వాత ఇంటికొచ్చాడు.

వంటగదిలోంచి వాళ్ల మామ్మ అడిగే కొశ్చన్స్‌కి ఆన్సర్స్ చెబుతూ రిలాక్స్‌గా సోఫాలో కూర్చున్నాడు. గాలి సరిపోనట్లు అన్పించి ఫ్యాన్ స్పీడ్ పెంచుకున్నాడు.

ఇందుమతి ఎప్పుడైనా అంతే! మనవడి చదువు గురించి శ్రద్ధగా అడిగి తెలుసుకుంటుంది.

అభిరాం ఎం.బి.ఎ. థర్డ్ సెమ్‌కి రాగానే–మార్కెటింగ్ బాగుంటుందా? ఫైనాన్స్ బాగుంటుందా? హెచ్.ఆర్. అయితే ఎలా వుంటుంది? అని వాటి గురించి తెలిసిన వాళ్ల దగ్గరకి వెళ్లి తెలుసుకొని, వాళ్లు చెప్పే దాన్ని బట్టి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mounaragam+Revised**

* * *